సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం

# సీమకిరణం

SEEMAKIRANAM TELUGU DAILY

ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా

జాతీయ తెలుగు దినపత్రిక

www.seemakiranam.com
www.seemakiranamnews.com
epaper.seemakiranam.com

ప్రచురణ : కర్నూలు & శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా.

PUBLISHED BY : KURNOOL & SRI POTTI SRIRAMULU NELLORE DISTRICT

ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 136 | పేజిలు : 04, వెల రూ. 2 రూ/ | బుధవారం 05-08-2026

### ఏ నియోజకవర్గానికైనా

## స్థానిక ఎమ్మెల్యేనే బాస్




- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, పార్టీ పరిశీలకుడు జగ్గారెడ్డి
- తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు
- 7 పేజీలతో నివేదికను పీసీసీ చీఫ్ కు అందించిన జగ్గారెడ్డి
- అందరి నుంచి అభిప్రాయాలను సేకరించి నివేదికను తయారు చేశామన్న జగ్గారెడ్డి



## నామినేషన్ పత్రాలను రేవంత్ రెడ్డి సొంతంగా నింపగలరా?

- బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ సవాల్
- ఇంజినీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి రేంత్ రెడ్డి దారుణ వ్యాఖ్యలు చేశారన్న అరవింద్
- విద్య పట్ల కనీస చిత్తశుద్ధి లేని వ్యక్తి అంటూ విమర్శలు
- రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారుణంగా తయారైందని వ్యాఖ్య

**హైదరాబాద్ :** ఇంజినీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అత్యంత దారుణమని నిజామాబాద్ - మిగతా 2 లో

### పదేళ్ల పాలనలో బీఆర్ఎస్

## రాష్ట్రాన్ని పట్టించుకోలేదు

- మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు
- బీఆర్ఎస్‌కు క్షుద్రపూజలు చేయడం అలవాటని టీపీసీసీ చీఫ్ ఆరోపణ
- మాజీ మంత్రి హరీశ్ రావు ఆలయాల పర్యటనలపై ప్రశ్నలు
- జూన్ 2, జులై 23 తేదీల్లో హరీశ్ ఎక్కడున్నారో చెప్పాలని డిమాండ్
- పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ రాష్ట్రాన్ని పట్టించుకోలేదన్న మహేష్ గౌడ్
- తెలంగాణ ప్రజలకు ఆ పార్టీ క్షమాపణ చెప్పాలని వ్యాఖ్య




**హైదరాబాద్ :** బీఆర్ఎస్ పార్టీకి క్షుద్రపూజలు చేయడం ఒక అలవాటుగా మారిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఇటీవల కొన్ని ఆలయాలను సందర్శించడంపై ఆయన పలు ప్రశ్నలు లేవనెత్తారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహేశ్ గౌడ్ మాట్లాడారు. జూన్ 2న తిరుచ్చి, జులై 23న శివమొగ్గకు హరీశ్ రావు ఎందుకు వెళ్లారని ఆయన నిలదీశారు. ఆయా తేదీల్లో హరీశ్ రావు ఎక్కడ ఉన్నారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలకు సంబంధించి తన వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయని మహేశ్ గౌడ్ వెల్లడించారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ తెలంగాణకు చేసిందేమీ లేదని, అందుకే ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. ఎన్నో త్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో ప్రజల నమ్మకాన్ని బీఆర్ఎస్ పూర్తిగా కోల్పోయిందని ఆయన పేర్కొన్నారు. చేసిన తప్పులకు గాను బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. - మిగతా 2 లో




## పోటెత్తుతున్న వరద.. వేగంగా నిండుతున్న శ్రీశైలం డ్యామ్

- ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణమ్మకు పోటెత్తుతున్న వరద
- శ్రీశైలం జలాశయంలో ఈ సాయంత్రానికి 100 టీఎంసీలకు చేరనున్న నీటి నిల్వలు
- నాగార్జునసాగర్ ఇన్‌ఫ్లో 900 క్యూసెక్కులు

**అమరావతి :** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో శ్రీశైలం జలాశయానికి కృష్ణా నది వరద ప్రవాహం పోటెత్తుతోంది. ఐదు రోజుల క్రితం ప్రవాహం ప్రారంభమైన - మిగతా 2 లో

## పేదరికం లేని సమాజం చూడాలనేది నా కల

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- 2024లో ఎవరూ ఊహించని విధంగా ఎన్డీఏ గెలిచింది
- భయంకర పరిస్థితులు, ఒక విప్లవం కారణంగా 57 శాతం ఓట్లు వచ్చాయి
- రాష్ట్రం అభివృద్ధి బాట పట్టిందన్న సీఎం చంద్రబాబు
- 2024 నాటి పరిస్థితులు, తాజా పరిస్థితులపై వాస్తవాలు ప్రజల ముందు




**అమరావతి :** రాష్ట్ర సమగ్ర సమాచారం ప్రజలకు తెలపడం ముఖ్యమని సీఎం చంద్రబాబు అన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్థికశాఖపై శ్వేతపత్రం విడుదల చేసిన సీఎం చంద్రబాబు 2024 నాటి పరిస్థితులు, తాజా పరిస్థితులపై వాస్తవాలు ప్రజల ముందు పెట్టారు. ప్రజలకు ఆర్థిక పరిస్థితిపై సమగ్ర సమాచారం చెబుతున్నట్లు సీఎం వివరించారు. ఇదొక చారిత్రక అంశమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశామన్నారు. ఎప్పటికప్పుడు ప్రోగ్రెస్ రిపోర్టులు ప్రజలకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం బాగా పని చేస్తుందనేందుకు భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం నిదర్శనమన్నారు. ప్రభుత్వం పనిచేస్తే ప్రజలు ఎలా స్పందిస్తారో అన్నదానికి భోగాపురం ఉదాహరణ అని హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తు అనుసంధానానికి అంతర్జాతీయ గేట్‌వేగా తయారు చేశామన్నారు. సమైక్యాంధ్రప్రదేశ్‌లో తెలుగు జాతి కోసం అభివృద్ధి చేశామని, రెండు రాష్ట్రాలు కూడా తానే అభివృద్ధి చేసినట్లు సీఎం - మిగతా 2 లో

### గోదావరి జిల్లాల తాగునీటి సమస్యకు

## శాశ్వత పరిష్కారం



- ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- జల్ జీవన్ మిషన్ కింద అమలవుతున్న 'అమరజీవి జలధార' ప్రాజెక్టు
- తీరప్రాంతాల్లోని 33 లక్షల మందికి సురక్షిత మంచినీటిని అందించడమే లక్ష్యం
- నిర్దేశిత వ్యవధిలోనే నిర్మాణాలను పూర్తి చేయాలన్న పవన్

**అమరావతి :** జల్ జీవన్ మిషన్ కింద చేపడుతున్న 'అమరజీవి జలధార' ప్రాజెక్టు ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతుందని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ - మిగతా 2 లో

### పాక్ ఆక్రమిత

## కశ్మీర్‌లో రక్తపాతం



- పాక్‌పై అంతర్జాతీయ సంస్థల ఆగ్రహం
- పీవోకే ఎన్నికల వేళ పెరిగిపోయిన హింస, అశాంతి
- జర్నలిస్టుల అదృశ్యంపై వెల్లువెత్తిన విమర్శలు
- నిరసనల్లో ఇప్పటివరకు 80 మంది మృతి చెందినట్లు వెల్లడి
- ఇంటర్నెట్ సేవల నిలిపివేత, మీడియాపై తీవ్ర ఆంక్షలు

### 36 దేశాల నుంచి 274 మంది

## నేరస్థుల్ని భారత్‌కు తీసుకొచ్చిన కేంద్రం




- ఆపరేషన్ త్రిశూల్
- రూ. 17874 కోట్ల ఆస్తులు జప్తు!
- 36 దేశాల నుంచి 274 మంది పరారీలోని నేరస్థుల్ని భారత్‌కు తీసుకొచ్చిన కేంద్రం
- 2019 నుంచి 2026 వరకు డేటా విడుదల చేసిన హోం శాఖ
- రూ. 17,874 కోట్ల ఆస్తుల అటాచ్‌మెంట్

**ఢిల్లీ :** దేశం విడిచి పారిపోయిన నేరస్థులపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నట్లు కేంద్ర హోం శాఖ వెల్లడించింది. 2019 నుంచి 2026 వరకు మొత్తం 36 దేశాల నుంచి 274 మంది పరారీలో ఉన్న నేరస్థుల్ని భారత్‌కు తీసుకొచ్చినట్లు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. వీరిలో ఉగ్రవాదులు, గ్యాంగ్‌స్టర్లు, ఆర్థిక నేరస్థులు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాదారులు, హత్యలు, అత్యాచారాలు పోక్సో చట్టం కింద నేరాలకు పాల్పడిన వారు కూడా ఉన్నారని తెలిపింది. ఇదే సమయంలో మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద పరారీలో ఉన్న నేరస్థులకు చెందిన సుమారు రూ. 17874 కోట్ల విలువైన ఆస్తుల్ని ప్రభుత్వ ఏజెన్సీలు అటాచ్ (జప్తు) చేసినట్లు హోం శాఖ స్పష్టం చేసింది. పరారైన ఆర్థిక నేరగాళ్లకు (ఫ్యూగిటివ్ ఎకనామిక్ అఫెండర్స్) సంబంధించిన కేసుల్లో రూ. 18762 కోట్లను తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు - మిగతా 2 లో

### ఉదయనిధికి హైకోర్టులో ఊరట

## బెయిల్ మంజూరు



- ఉదయనిధికి మద్రాస్ హైకోర్టు బెయిల్
- విడుదల చేయాలని పోలీసులకు ఆదేశం
- విచారణకు సహకరించాలని కోర్టు సూచన
- రిమాండ్‌కు పంపే ఆలోచన లేదన్న పోలీసులు
- ఎఫ్ఐఆర్ నేపథ్యంలోనే విచారణ చేపట్టినట్లు వెల్లడి
- విచారణ పూర్తికాగానే విడుదల చేస్తామన్న పోలీసులు

**చెన్నై :** తమిళనాడు ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్‌కు మద్రాస్ హైకోర్టులో ఊరట లభించింది. ఆయనకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. ఈరోజే విడుదల చేయాలని పోలీసులను ఆదేశించింది. అలాగే విచారణకు పూర్తిగా సహకరించాలని ఉదయనిధికి సూచించింది. ముఖ్యమంత్రి విజయ్, సినీ నటి త్రిషకు సంబంధించిన వ్యాఖ్యల ఆరోపణల కేసులో ఈరోజు పోలీసులు ఉదయనిధిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బెయిల్ కోసం ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఉదయనిధిని రిమాండ్‌కు పంపే ఆలోచన తమకు లేదని తమిళనాడు పోలీసులు స్పష్టం చేశారు. ఎఫ్ఐఆర్ నమోదైన నేపథ్యంలో మాత్రమే ఆయన్ను విచారిస్తున్నామని తెలిపారు. విచారణ పూర్తైన వెంటనే విడుదల చేస్తామని కూడా వెల్లడించారు. - మిగతా 2 లో


# సంపాదకీయం

## ఉన్నత విద్య సామాన్యులకు సైతం అందుబాటులోకి తేవాలి

(హెచ్.ప్రతాప్)

ఒక దేశ భవిష్యత్తును నిర్మించేది సహజ వనరులు కాదు, మానవ వనరులు. ఆ మానవ వనరులను జ్ఞానం, నైపుణ్యాలు, సృజనాత్మకతతో తీర్చిదిద్దేది ఉన్నత విద్య. అందువల్ల ఉన్నత విద్యను కొద్దిమందికి పరిమితం చేయకుండా ప్రతి సామాన్య విద్యార్థికి అందుబాటులోకి తీసుకురావడం భారతదేశ అభివృద్ధికి అత్యంత కీలకం. అయితే నేడు గ్రామీణ ప్రాంతాలు, పేద మరియు మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక పరిమితులు, అధిక ఫీజులు, వసతి సమస్యలు, నాణ్యమైన విద్యాసంస్థల కొరత వంటి కారణాలతో ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. ఇది వ్యక్తిగత నష్టమే కాదు, దేశ ప్రతిభకు కూడా పెద్ద లోటు.భారతదేశంలో ఉన్నత విద్యా స్థూల ప్రవేశ నిష్పత్తి గత కొన్నేళ్లలో పెరుగుతున్నప్పటికీ, అది ఇంకా అభివృద్ధి చెందిన దేశాల స్థాయికి చేరుకోలేదు. జాతీయ విద్యా విధానం--2020 ప్రకారం 2035 నాటికి ఈ నిష్పత్తిని 50 శాతానికి పెంచాలని లక్ష్యంగా నిర్ణయించారు. అఖిల భారత ఉన్నత విద్యా సర్వే ప్రకారం ప్రస్తుతం ఈ నిష్పత్తి సుమారు 28 శాతం మాత్రమే ఉంది. అంటే పాఠశాల విద్య పూర్తిచేసిన యువతలో గణనీయమైన వర్గం ఉన్నత విద్యలోకి ప్రవేశించలేకపోతోందని అర్థం. ఈ పరిస్థితి మారకపోతే ప్రపంచ జ్ఞాన ఆర్థిక వ్యవస్థలో భారత్ తన పూర్తి సామర్థ్యాన్ని ప్రదర్శించడం కష్టమవుతుంది.ప్రస్తుతం ప్రైవేటు విద్యాసంస్థల్లో పెరుగుతున్న ఫీజులు సామాన్య కుటుంబాలకు భారంగా మారుతున్నాయి. చాలామంది విద్యార్థులు విద్యా రుణాలపై ఆధారపడడం లేదా చదువును మధ్యలోనే నిలిపివేయడం వంటి పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ప్రతిభకు బదులుగా ఆర్థిక స్థితి విద్యను నిర్ణయించే పరిస్థితి ఏర్పడితే సామాజిక అసమానతలు మరింత తీవ్రమవుతాయి. విద్య ఒక వస్తువు కాదు; అది ప్రతి పౌరుడికి సమాన అవకాశాలు కల్పించే రాజ్యాంగ స్ఫూర్తికి ప్రతీక.గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, పాలిటెక్నిక్‌లు, ఇంజినీరింగ్, నర్సింగ్, వృత్తి విద్యా కేంద్రాలను మరింత బలోపేతం చేయాలి. డిజిటల్ విద్యా వేదికలను విస్తరించి ప్రతి విద్యార్థికి నాణ్యమైన ఆన్‌లైన్ బోధన, డిజిటల్ గ్రంథాలయాలు, వర్చువల్ ప్రయోగశాలలు అందుబాటులోకి తీసుకురావాలి. విద్యార్థి వసతి గృహాలు, సురక్షిత రవాణా, విస్తృత ఉపకార వేతనాలు, తక్కువ వడ్డీతో విద్యా రుణాలు, ఆర్థికంగా బలహీన వర్గాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి చర్యలు ఉన్నత విద్యలో ప్రవేశాన్ని గణనీయంగా పెంచగలవు.అదేవిధంగా ఉన్నత విద్య కేవలం డిగ్రీల ప్రదానానికి పరిమితం కాకుండా ఉపాధి అవకాశాలను పెంపొందించేలా ఉండాలి. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాలను నవీకరించడం, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, నవకల్పన, స్టార్టప్‌ల ప్రోత్సాహం, ఇంటర్న్‌షిప్‌లు, పరిశ్రమ--విద్యాసంస్థల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం అత్యవసరం. విద్యార్థులు ఉద్యోగాలు వెతికే వారిగానే కాకుండా ఉద్యోగాలను సృష్టించే పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి విద్య దోహదపడాలి.మహిళలు, దివ్యాంగులు, గిరిజన ప్రాంతాల విద్యార్థులు, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక విద్యా మద్దతు అందించడం కూడా సమానంగా ముఖ్యం. భాషా అవరోధాలు, ప్రాంతీయ అసమానతలు, డిజిటల్ అంతరాలను తగ్గించే విధానాలు అమలు చేయాలి. మాతృభాషలో నాణ్యమైన ఉన్నత విద్యా బోధనకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా గ్రామీణ విద్యార్థుల ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అంతేకాకుండా ప్రతి జిల్లాలో పరిశోధనా కేంద్రాలు, నైపుణ్యాభివృద్ధి హబ్‌లు, కెరీర్ మార్గదర్శక కేంద్రాలను ఏర్పాటు చేస్తే విద్యార్థులు ప్రపంచ స్థాయి అవకాశాలను సొంతం చేసుకునే సామర్థ్యాన్ని పొందుతారు.భారత్ ప్రపంచంలోనే అత్యంత యువ జనాభా కలిగిన దేశం. ఈ జనాభా దేశానికి జనాభా లాభాంశంగా మారాలంటే ఉన్నత విద్య అందరికీ చేరువ కావాలి. నైపుణ్యం కలిగిన యువత పెరిగితే దేశ ఉత్పాదకత పెరుగుతుంది, నిరుద్యోగం తగ్గుతుంది, పరిశోధనలకు ఊతం లభిస్తుంది, ఆవిష్కరణలు పెరుగుతాయి. ప్రపంచ విశ్వవిద్యాలయాలతో భాగస్వామ్యాలు, విదేశీ విద్యా అవకాశాలు, పరిశోధన నిధులు పెరగడం ద్వారా భారత ఉన్నత విద్యా వ్యవస్థ అంతర్జాతీయ స్థాయిలో మరింత పోటీతత్వాన్ని సంతరించుకుంటుంది.విద్యపై చేసే వ్యయం ఖర్చు కాదు; అది దేశ భవిష్యత్తుపై చేసే అత్యంత విలువైన పెట్టుబడి. సామాన్యుడి ఇంటి గడప దాటి ఉన్నత విద్య చేరినప్పుడే ప్రతిభకు నిజమైన గుర్తింపు లభిస్తుంది. జ్ఞానసమాజ నిర్మాణం, ఆర్థిక పురోగతి, సామాజిక సమానత్వం, ప్రపంచ పోటీలో భారత స్థానం మరింత బలపడాలంటే ఉన్నత విద్య ప్రతి యువకుడికి అందుబాటులో ఉండేలా ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, పరిశ్రమలు, సమాజం సమిష్టిగా కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైంది. "ప్రతి ప్రతిభావంతుడికి అవకాశమే అసలైన సమానత్వం" అనే సూత్రాన్ని ఆచరణలో పెట్టినప్పుడే అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికీ చేరుతాయి. అదే నిజమైన వికసిత భారతానికి పునాది అవుతుంది.

## పేదరికం లేని సమాజం చూడాలనేది నా కల



**మొదటిపేజీ తరువాయి -** పేర్కొన్నారు.'సంపద పెరిగితే ఉపాధి పెరుగుతుంది. జీవన ప్రమాణాలు పెంచగలిగితేనే ప్రభుత్వానికి సంతృప్తి. సమాజంలో మార్పు తేవాలనే పీ4 కార్యక్రమం తీసుకొచ్చాం. దీనివల్ల 2.4 లక్షల కుటుంబాలకు సాయం అందుతోంది. ఆర్థిక అసమానతలు తగ్గించడమే ప్రథమ ప్రాధాన్యంగా పని చేస్తున్నాం. పేదరికం లేని సమాజం చూడాలనేది నా కల. మార్గదర్శి-బంగారు కుటుంబం నినాదం తీసుకొచ్చాం. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల అమలుకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాం. బీసీ, మైనారిటీలకు పెద్దఎత్తున సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. మహిళా సంఘాలకు రూ.14,757 కోట్లతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. 97 శాతం మహిళా సంఘాలు బ్యాంకు రుణాలు వినియోగించు కుంటున్నాయన్న ముఖ్యమంత్రి చంద్రబాబు.పాలన బాగుంటే దాని ఫలితాలు ప్రజా జీవితంలో ప్రస్ఫుటం అవుతాయన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడ్డాక బ్రాండ్ ఆంధ్ర పునరుద్ధరణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు, రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తు న్నామన్నారు. ఉమ్మడి ఏపీలో తలసరి ఆదాయం రూ.95,231గా ఉండేదని, విభజన తర్వాత తెలంగాణ తలసరి ఆదాయం రూ.1,24,104, ఏపీలో తలసరి ఆదాయం రూ.93,903 అని వివరించారు. ఈ పరిస్థితుల నుంచి సీఏజీఆర్ 13.5 శాతం వృద్ధి స్థాయికి చేరామన్నారు. 2019-24 మధ్య జీఎస్‌డీపీ వృద్ధిరేటు 3.18 శాతం తగ్గిందని, వృద్ధిరేటు తగ్గడంతో రూ.6.94లక్షల కోట్ల నష్టం జరిగిందని సీఎం వివరించారు.పొదుపు చేశాం: వైఎస్సార్సీపీ పాలనలో నీతి ఆయోగ్ నివేదిక చూస్తే జరిగిన ఆర్థిక విధ్వంసం తేటతెల్లం అవుతోందని సీఎం అన్నారు. పెండింగ్ బిల్లులు రూ.48,616 కోట్లు ఉంటే దానిని రూ.29,259 కోట్లకు తగ్గించాగలిగామని సీఎం స్పష్టం చేశారు. 370లోన్లపై చర్చలు జరిపి 1100 కోట్లు ఆదా చెయ్యగలిగామని మెత్తంగా రూ. 8600 కోట్లు పొదుపు చేశామని ముఖ్యమంత్రి వివరించారు.రాష్ట్రంలో భయం కరమైన పరిస్థితులు ఉండేవని సీఎం అన్నారు. ఒక విప్లవం కారణంగా 57 శాతం ఓట్లు వచ్చాయని, 2024లో ఎవరూ ఊహించని విధంగా ఎన్డీఏ గెలిచిందని అన్నారు. గొడవలు పడితే సాధించేది ఏమీ ఉండదని, కష్టపడి పనిచేస్తే ఫలితం పది రెట్లు ఉంటుందన్నారు. 2019 వైఎస్సార్సీపీ పాలనలో సంస్థలు రాలేదని వారి హయాంలో బ్రాండ్ ఆంధ్రా దెబ్బతిందని ధ్వజమెత్తారు. మూడు రాజధానులు అంటే షాక్‌కు గురయ్యామని ఎద్దేవా చేశారు.

## 36 దేశాల నుంచి 274 మంది నేరస్థుల్ని భారత్‌కు తీసుకొచ్చిన కేంద్రం

**మొదటిపేజీ తరువాయి -**
వివరించింది.హోం శాఖ గణాంకాల ప్రకారం అత్యధికంగా 2025లో పరారీలో ఉన్న 70 మంది నేరస్థుల్ని భారత్‌కు తీసుకొచ్చారు. 2026లో చూస్తే జులై వరకే ఏకంగా 45 మంది అప్పగింత పూర్తయింది. అంతకుముందు 2024 సంవత్సరంలో 43 మంది, 2023లో 37 మంది, 2022లో 40, 2021లో 23, 2020లో ఏడుగురు, 2019లో 9 మందిని భారత్‌కు తీసుకువచ్చినట్లు పేర్కొంది.భారత్‌కు రప్పించిన 274 మంది పరారైన నేరస్థులు వివిధ రకాల దారుణమైన నేరాలకు సంబంధించిన కేసుల్లో నిందితులుగా ఉన్నారు. వీరిలో 62 మంది హత్యలు, దోపిడీలు, హింసాత్మక నేరాల్లో నిందితులుగా ఉండగా, 53 మంది అత్యాచారాలు, పోక్సో కేసుల్లో; 42 మంది గ్యాంగ్‌స్టర్ కార్యకలాపాల్లో; 18 మంది మానవ అక్రమ రవాణా, కిడ్నాప్ కేసుల్లో నిందితులుగా ఉన్నారు. మరో 17 మంది ఉగ్రవాదం, దేశద్రోహం, నార్కో టెర్రర్ కేసుల్లో; 16 మంది డ్రగ్స్, చీటింగ్ కేసుల్లో నేరస్థులుగా ఉన్నారు. స్మగ్లింగ్, నకిలీ కరెన్సీ, సైబర్ నేరాల్లో 12 మంది, ఆర్థిక మోసాల కేసుల్లో 9 మంది నిందితులుగా ఉన్నారు.పరారీలోని నేరస్థుల్ని గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ త్రిశూల్ చేపట్టింది. ఇక్కడ శాటిలైట్ లొకేషన్ వివరాలు, డిజిటల్ ఫుట్‌ప్రింట్లు, నిఘా వ్యవస్థల ఆధునిక సాంకేతికత సహాయంతో విదేశాల్లో పేర్లు, గుర్తింపులు మార్చుకొని దాక్కున్న నిందితుల్ని గుర్తించగలిగామని తెలిపింది. సీబీఐ, ఇంటెలిజెన్స్ బ్యూరో, రా ,విదేశాంగ శాఖ, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (చీ×దీ), డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ , రాష్ట్ర పోలీసు శాఖలు సమన్వయంతో కలిసి పనిచేయడం వల్లే ఇది సాధ్యమైందని స్పష్టం చేసింది. దీనిని హోల్ ఆఫ్ గవర్నమెంట్ విధానంగా అభివర్ణించింది.ఇంకా ఇంటర్‌పోల్ సహకారంతో గత మూడేళ్ల కాలంలో 501 కంటే ఎక్కువగా రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయగా, 2026లోనే ఇప్పటివరకు 182 నోటీసులు జారీ అయ్యాయి. మరోవైపు దేశంలోని 1400 కంటే ఎక్కువ పోలీస్ ఏజెన్సీలను ఇంటర్‌పోల్‌తో అనుసంధానించేందుకు భారత్‌పోల్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించారు. దీని ద్వారా అంతర్జాతీయంగా సమాచార మార్పిడి సమయం గణనీయంగా తగ్గింది.అమెరికా నుంచి 26/11 ముంబయి దాడి నిందితుడు తహవ్వూర్ హుస్సేన్ రాణాను భారత్‌కు తీసుకురావడం దేశం సాధించిన అతిపెద్ద విజయాల్లో ఒకటని హోం శాఖ పేర్కొంది. క్లిష్టమైన ఉగ్రవాద కేసుల్లో భారత్ అనుసరించిన న్యాయపరమైన, దౌత్యపరమైన ప్రయత్నాలకు ఇది ఉదాహరణగా నిలిచిందని తెలిపింది. జమ్ముకశ్మీర్‌లో విదేశాల నుంచి నడిచే నార్కో- టెర్రరిజం నెట్‌వర్క్‌లను ఛేదించడంలోనూ ఈ చర్యలు కీలకంగా మారాయని తెలిపింది.పరారీలో ఉన్న నేరస్థులు కేవలం పాత కేసులకే పరిమితం కాదని, వారు దేశ భద్రత, ఆర్థిక స్థిరత్వం, శాంతి భద్రతలకు నిరంతర ముప్పుగా ఉంటారని హోం శాఖ స్పష్టం చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో పరారీలో ఉన్న నేరస్థుల అప్పగింతను జాతీయ ప్రాధాన్యత అంశంగా తీసుకున్నట్లు తెలిపిన హోం శాఖ, ఇందులో భాగంగానే 2018లో ఫ్యూగిటివ్ ఎకనామిక్ అఫెండర్స్ చట్టాన్ని తీసుకొచ్చినట్లు గుర్తుచేసింది.

## ఏ నియోజకవర్గానికైనా స్థానిక ఎమ్మెల్యేనే బాస్



**మొదటిపేజీ తరువాయి -** సూర్యాపేట జిల్లా తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలు, వర్గపోరు అంశంపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, పార్టీ పరిశీలకుడు జగ్గారెడ్డి తన సమగ్ర నివేదికను సిద్ధం చేశారు. మొత్తం 7 పేజీలతో కూడిన ఈ రిపోర్టును సీల్డ్ కవర్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు ఆయన అందజేశారు.తుంగతుర్తి నియోజకవర్గంలో ఇటీవల చోటుచేసుకున్న ఘర్షణలు, వర్గ విభేదాలపై గత పది రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి ఇరువర్గాలు, స్థానిక నాయకులు, కార్యకర్తల నుంచి అభిప్రాయాలను సేకరించినట్లు జగ్గారెడ్డి తెలిపారు. ఆ వివరాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఈ నివేదికను రూపొందించినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన... ఏ నియోజకవర్గానికైనా స్థానిక ఎమ్మెల్యేనే 'ఫస్ట్ బాస్' అని, ఆ తర్వాతి స్థానంలోనే ఎంపీ, మంత్రులు ఉంటారని స్పష్టం చేశారు. అలాగే మూడో ప్రాధాన్యత డీసీసీ అధ్యక్షుడికి ఉంటుందని వ్యాఖ్యానించారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి సంబంధించిన వివాదాలు, ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను కూడా ఈ నివేదికలో పొందుపరిచామని చెప్పారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీకి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలు ప్రధాన స్తంభాలని ఈ సందర్భంగా జగ్గారెడ్డి పేర్కొన్నారు.

## నామినేషన్ పత్రాలను రేవంత్ రెడ్డి సొంతంగా నింపగలరా?



**మొదటిపేజీ తరువాయి -** బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం చేసిన వ్యాఖ్యలు విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రుల ఆత్మస్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్య పట్ల కనీస చిత్తశుద్ధి లేని వ్యక్తి విద్యాశాఖ మంత్రిగా ఉండటం ఏమాత్రం సరైనది కాదని విమర్శించారు. సీఎం వద్ద ఉన్న విద్యాశాఖ బాధ్యతలను వెంటనే మంత్రి శ్రీధర్ బాబుకు అప్పగిస్తే బాగుంటుందని సూచించారు. రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను రేవంత్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించిన అరవింద్... ఎవరి సహకారం కూడా తీసుకోకుండా సీఎం నామినేషన్ పత్రాలనైనా సొంతంగా నింపగలరా? అని సవాల్ విసిరారు.రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారుణంగా తయారైందని... కనీసం బ్లాక్ బోర్డులు, చాక్ పీసులు, సరైన మరుగుదొడ్లు కూడా లేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఒక్క ప్రభుత్వ పాఠశాలనైనా సందర్శించారా? అని ప్రశ్నించారు. ఉన్న పాఠశాలలను బాగుచేయడం వదిలేసి, కొత్త నిర్మాణాల పేరుతో కమీషన్లు దండుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా విద్యా రంగానికి ప్రాధాన్యమిచ్చి సమస్యలను పరిష్కరించాలని ఎంపీ డిమాండ్ చేశారు.

## గోదావరి జిల్లాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

**మొదటిపేజీ తరువాయి -** పేర్కొన్నారు. మంగళగిరిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఈ ప్రాజెక్టు పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.తీరప్రాంతాల్లోని దాదాపు 33 లక్షల మంది ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు పవన్ వివరించారు. నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అధికారులకు స్పష్టం చేశారు. నిర్దేశిత వ్యవధిలోనే కీలక నిర్మాణాలను పూర్తి చేసి, ప్రాజెక్టును సాధ్యమైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. తీరప్రాంత ప్రజల తాగునీటి భద్రతను నిర్ధారించడంలో జల్ జీవన్ మిషన్ కీలక పాత్ర పోషిస్తోందని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం కొనియాడారు.

## పోటెత్తుతున్న వరద.. వేగంగా నిండుతున్న శ్రీశైలం డ్యామ్

**మొదటిపేజీ తరువాయి -** సమయంలో 820 అడుగులుగా ఉన్న నీటిమట్టం, నిన్న సాయంత్రానికి 855.10 అడుగులకు చేరింది. ప్రస్తుతం డ్యామ్‌లో 92.048 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఈ సాయంత్రానికి ఈ నిల్వలు 100 టీఎంసీల మార్కును దాటుతాయని ప్రాజెక్టు అధికారులు అంచనా వేస్తున్నారు.శ్రీశైలం జలాశయం: జూరాల నుంచి సోమవారం 2.21 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, రాత్రి సమయానికి శ్రీశైలానికి 1.55 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. రోజుకు లక్ష క్యూసెక్కులకు పైగా వచ్చే ఈ వరద ఉద్ధృతి మరో నాలుగైదు రోజులు కొనసాగవచ్చని శ్రీశైలం డ్యామ్ సీఈ కబీర్ బాషా తెలిపారు.ఎగువ కర్ణాటక ప్రాజెక్టులు: ఆలమట్టి డ్యామ్‌లోకి 1,25,855 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, దిగువకు 1.50 లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టులోకి 1,28,954 క్యూసెక్కులు వస్తుండగా, 1,40,880 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.జూరాల ... తుంగభద్ర: నారాయణపూర్ నుంచి వస్తున్న నీటికి భీమా నది వరద జలాలు తోడవడంతో జూరాలకు ఏకంగా 1.92 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. వచ్చిన వరదను దృష్టిలో ఉంచుకొని జూరాల నుంచి 2,21,765 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. తుంగభద్ర డ్యామ్‌లోకి 57,785 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది.నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం 136 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఎగువ నుంచి 900 క్యూసెక్కులు వస్తున్నాయి. పులిచింతలలో 28.91 టీఎంసీల నీటినిల్వ ఉంది. ప్రకాశం బ్యారేజీలోకి 6,958 క్యూసెక్కులు చేరుతుండగా, 6,499 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు.


## హైదరాబాద్‌లో 18 శాతానికి తగ్గిన వర్షపాతం లోటు

**తెలంగాణకు ఎల్లో అలర్ట్**

**వారం రోజుల క్రితం 34 శాతంగా ఉన్న లోటు**

**నగరంలో కొన్ని ప్రాంతాల్లో అధిక లోటు,**


**మరికొన్నిచోట్ల అదనపు వర్షపాతం**



తెలంగాణ వ్యాప్తంగా ఆగస్టు 10 వరకు ఎల్లో అలర్ట్ జారీ

గత వారం రోజులుగా కురుస్తున్న విస్తారమైన వర్షాలతో హైదరాబాద్ నగరానికి గణనీయమైన ఊరట లభించింది. వారం క్రితం 34 శాతంగా ఉన్న వర్షపాత లోటు ప్రస్తుతం 18 శాతానికి తగ్గింది. ప్రస్తుత రుతుపవనాల సీజన్‌లో ఇప్పటివరకు సాధారణంగా 297.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 245 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సంస్థ (టీజీడీపీఎస్) గణాంకాలు వెల్లడిస్తున్నాయి.అయితే, నగరంలోని అన్ని ప్రాంతాల్లో వర్షపాతం ఒకే రీతిలో లేదు. తిరుమలగిరిలో 45 శాతం, సైదాబాద్‌లో 35 శాతం, మారేడ్‌పల్లిలో 31 శాతం, అంబర్‌పేటలో 27 శాతం, నాంపల్లి, చార్మినార్‌లలో 26 శాతం చొప్పున అత్యధిక లోటు నమోదైంది. మరోవైపు, గోల్కొండలో సాధారణం కంటే 19 శాతం, బహదూర్‌పురాలో 5 శాతం అధిక వర్షపాతం నమోదైంది. షేక్‌పేట, అమీర్‌పేట, ముషీరాబాద్, ఆసిఫ్‌నగర్ వంటి ప్రాంతాల్లో వర్షపాతం సాధారణ స్థాయికి చేరువలో ఉంది.ఇదిలా ఉండగా, రానున్న ఏడు రోజుల పాటు తెలంగాణవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఆగస్టు 10 వరకు 'ఎల్లో అలర్ట్' జారీ చేసింది. ఈ వర్షాలతో పాటు పిడుగులు పడే ప్రమాదం ఉందని, ఈదురుగాలులు బలంగా వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. వర్షాల ప్రభావంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని అంచనా వేసింది.

## పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో రక్తపాతం



**మొదటిపేజీ తరువాయి -** పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో (పీవోకే) జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అక్కడ తీవ్ర హింస, అశాంతి చోటుచేసుకుంటున్నాయి. నిరసనకారులపై పాక్ భద్రతా బలగాలు దాడులకు పాల్పడటం, మీడియాపై ఉక్కుపాదం మోపడం, ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడంపై ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్, కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ (సీపీజే) వంటి అంతర్జాతీయ సంస్థలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. మానవ హక్కుల ఉల్లంఘనలపై వెంటనే దర్యాప్తు జరపాలని పాకిస్థాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి.రావల్ కోట్‌లో నిరసనకారులపై భద్రతా బలగాలు విచక్షణారహితంగా వ్యవహరించాయని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆరోపించింది. ఈ ఘటనలపై స్వతంత్ర విచారణ జరిపించాలని, నిలిపివేసిన ఇంటర్నెట్, మొబైల్ సేవలను వెంటనే పునరుద్ధరించాలని కోరింది. స్వతంత్ర పరిశీలకులను, మీడియాను ఆ ప్రాంతంలోకి అనుమతించాలని డిమాండ్ చేసింది.పీవోకేలో పత్రికా స్వేచ్ఛను దారుణంగా అణచివేస్తున్నారని సీపీజే ఆరోపించింది. ఆగస్టు 1న ఇస్లామాబాద్‌లో జర్నలిస్టులు రాజీ తాహిర్, మహమ్మద్ సైఫ్‌లను పోలీసు దుస్తుల్లో ఉన్న వ్యక్తులు అపహరించారని, వారి ఆచూకీ ఇప్పటికీ తెలియరాలేదని తెలిపింది. మరో జర్నలిస్ట్ రాజా ఇక్రామ్‌ను నిర్బంధించి, ఆ తర్వాత విడుదల చేశారని పేర్కొంది. జర్నలిస్టులను అక్రమంగా నిర్బంధిస్తే తక్షణమే విడుదల చేయాలని పాక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.ఈ నిరసనల్లో మృతుల సంఖ్య పెరుగుతోందని 'హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ పీవోజేకే' వెల్లడించింది. ఆదివారం నాటికి రావల్ కోట్, మీర్‌పూర్, ముజఫరాబాద్‌లలో జరిగిన హింసాత్మక ఘటనల్లో మొత్తం 80 మంది మరణించారని, వీరిలో నలుగురు పోలీసులు కూడా ఉన్నారని తన నివేదికలో పేర్కొంది.

## హైదరాబాద్‌లో కల్తీ మసాలాల తయారీ కేంద్రాలపై దాడులు

**25 టన్నులకు పైగా సరుకు స్వాధీనం**

**13 మసాలా తయారీ కేంద్రాలపై మెరుపు దాడులు చేశామన్న సజ్జనార్**

**ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ రంగులు ఉపయోగిస్తున్నారని వెల్లడి**

**కల్తీరాయుళ్లపై ఆహార భద్రత చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక**



భాగ్యనగరంలో కల్తీ మసాలా తయారీ కేంద్రాలే లక్ష్యంగా బృందాలు మెరుపు దాడులు నిర్వహించినట్లు హైదరాబాద్ సీపీ సజ్జనార్ వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా చేపట్టిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో మొత్తం 13 మసాలా వ్యాపార సంస్థల్లో తనిఖీలు చేపట్టామని తెలిపారు. ఈ సోదాల్లో 25 టన్నులకు పైగా కల్తీ మసాలాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు, ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశామని చెప్పారు. మైలార్‌దేవ్‌పల్లి, బాలాపూర్ పోలీస్ స్టేషన్లలో ఇప్పటివరకు మూడు కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.తనిఖీల్లో వాము, జీలకర్ర, లవంగం, షాజీరా, ఆవాలు వంటి నిత్యం వాడే మసాలా దినుసుల్లో తీవ్రస్థాయిలో కల్తీ జరుగుతున్నట్లు గుర్తించామని సజ్జనార్ తెలిపారు. ఆకర్షణీయమైన మెరుపు, రంగు కోసం ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ రంగులు, టాల్కమ్ పౌడర్, ఇండస్ట్రియల్ డైలు, రైస్ బ్రాన్ ఆయిల్‌ను వినియోగిస్తున్నారని వివరించారు. దాడుల సందర్భంగా సుమారు 89 టన్నుల ముడి పదార్థాలను సీజ్ చేసి, నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపించామని తెలిపారు. కల్తీరాయుళ్లపై ఆహార భద్రత చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఇలాంటి రసాయనాలతో కూడిన కల్తీ మసాలాలు తీసుకోవడం వల్ల క్యాన్సర్, కాలేయం, మూత్రపిండాల వ్యాధులు, తీవ్రమైన అలర్జీలు, జీర్ణక్రియ సమస్యలు వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు. ఎ-ఫీూూ బృందం ఏర్పడిన 140 రోజుల్లోనే 659 ప్రాంతాల్లో సోదాలు చేసి, 202 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని, మొత్తం 246 టన్నుల కల్తీ ఆహారాన్ని సీజ్ చేశామని వెల్లడించారు. నగరంలో కల్తీ ఆహారంపై ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

# రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం సమర్థవంతంగా అమలు చేయాలి

జిల్లా నోడల్ అధికారి అనిల్‌కుమార్ రెడ్డి







**ప్యాపిలి జులై 4 (సీమ కిరణం న్యూస్ ):** రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం ఎన్‌సీడీసీ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ అనిల్‌కుమార్ రెడ్డి మంగళవారం ప్యాపిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆశా కార్యకర్తల సమీక్ష సమావేశంలో అసంక్రామిక వ్యాధుల ఎన్సిడి సర్వే, స్క్రీనింగ్ పురోగతిని పరిశీలించారు. అసంక్రామిక వ్యాధుల సర్వేను మరో నాలుగు రోజుల్లో నాణ్యతతో, ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. అలాగే రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంపై సిబ్బందికి శిక్షణ అందిస్తూ అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో అవుట్‌రీచ్ కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని సూచించారు. పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలు, పోషకాహార లోపాలు, వివిధ వ్యాధులు, అభివృద్ధి జాప్యం వంటి 4ఉలుతో పాటు హైపర్‌టెన్షన్, మధుమేహం, మూత్రపిండాల సంబంధిత సమస్యలు, సెల్‌ఫోన్ అధిక వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు తదితర మొత్తం 38 రకాల ఆరోగ్య పరిస్థితులపై స్క్రీనింగ్ నిర్వహించాలని తెలిపారు. స్క్రీనింగ్‌లో గుర్తించిన కేసులను నంద్యాల జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ కు వెంటనే రిఫర్ చేసి, అవసరమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రాహుల్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ రాఘవేంద్ర గౌడ్, పర్యవేక్షకులు మనోహర్ రెడ్డి, సరోజ, శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, రోజా, ప్రసన్నతో పాటు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కల్లూరు ఎమ్మార్వో ఆంజనేయులు





**కర్నూలు ప్రతినిధి, ఆగస్టు 04, (సీమ కిరణం న్యూస్ ):** పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని కల్లూరు ఎమ్మార్వో ఆంజనేయులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి, శాలువాతో సత్కరించి, శ్రీవేంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని బహూకరించారు. శుభాకాంక్షలు తెలిపిన కల్లూరు ఎమ్మార్వో ఆంజనేయులకు ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొని ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## తెలుగు రాష్ట్రాల్లో తొలి వందే భారత్ స్లీపర్.. ఈ రూట్లోనే సర్వీసులు.. టైమింగ్స్ వచ్చేశాయి..

తెలుగు రాష్ట్రాల్లో తొలి వందే భారత్ స్లీపర్ రైలు త్వరలో రానుంది. విశాఖపట్నం-బెంగళూరు మార్గంలో దీనిని ప్రవేశపెట్టనున్నారని తెలుస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే రైల్వేశాఖ సన్నాహాలు చేస్తోంది. టైమింగ్స్, స్టాపుల వివరాలు ఇప్పటికే బయటకు వచ్చాయి. రైల్వే బోర్డు నుంచి ఆమోదం లభించాక స్టార్ట్ కానుంది. ఏపీ ప్రజలకు భారీ గుడ్ న్యూస్. ఆంధ్రప్రదేశ్‌లో తొలి వందే భారత్ స్లీపర్ ట్రైన్ త్వరలో అందుబాటులోకి రానుంది. దేశంలో ఈ ఏడాది జనవరిలో తొలి వందే భారత్ స్లీపర్ రైలు హౌరా-గువహతి మధ్య పట్టాలెక్కింది. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ఈ ట్రైన్ ప్రారంభించారు. అయితే తెలుగు రాష్ట్రాల్లో ఈ రైళ్లు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. అయితే ఇప్పుడు ఎట్టకేలకు అందుకు మార్గం సుగమమైంది. విశాఖపట్నం-బెంగళూరు మధ్య వందే భారత్ స్లీపర్ రైలు నడిపేందుకు రైల్వేశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ఈ రైలు టైమింగ్స్‌తో పాటు ఏయే స్టేషన్లలో ఆగుతుందనే వివరాలు కూడా బయటకు వచ్చాయి. ఈ ట్రైన్ టైమింగ్స్, రూట్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### టైమింగ్స్ ఇవే..

విశాఖపట్నం-బెంగళూరు మధ్య వందే భారత్ స్లీపర్ రైలుపై మరో అప్డేట్ వచ్చింది. ఈ రైలు టైమింగ్స్, స్టాపుల వివరాలు బయటకొచ్చాయి. వారంలో ఆరు రోజుల పాటు ఈ ట్రైన్ సర్వీసులు అందించనుంది. సోమవారం తప్ప మిగతా రోజుల్లో అందుబాటులో ఉంటుంది. విశాఖపట్నంలో రాత్రి 8.15 గంటలకు ఈ రైలు బయల్దేరి.. తర్వాతి రోజు ఉదయం 10 గంటలకు బెంగళూరుకు చేరుకుంటుంది. ఇక తిరుగు ప్రయాణంలో బెంగళూరులో రాత్రి 8 గంటలకు బయల్దేరి విశాఖపట్నానికి మరుసటి రోజు ఉదయం 10 గంటలకు చేరుకుంటుంది. ఈ రైలులో 14 గంటల్లోనే విశాఖ-బెంగళూరు మధ్య ప్రయాణం చేయవచ్చు. ప్రస్తుతం ఉన్న రైళ్లల్లో ప్రయాణించాలంటే 18 నుంచి 20 గంటల సమయం పడుతుంది. వందే భారత్ స్లీపర్‌లో 14 గంటల్లోనే ఇరు నగరాల మధ్య ప్రయాణించవచ్చు. ఈ రైలు దువ్వాడ, కృష్ణాకెనాల్, నంద్యాల, ధర్మవరం మీదుగా వెళుతుంది.

### త్వరలోనే ప్రారంభం

ఇప్పటికే తెలుగు రాష్ట్రాల నుంచి బెంగళూరుకు వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయి. అయితే ఇప్పుడు వందే భారత్ స్లీపర్ ట్రైన్ అందుబాటులోకి రానుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విశాఖపట్నం-బెంగళూరు వందే భారత్ స్లీపర్ రైలుపై రైల్వే అధికారులు స్పందించారు. ఈ మార్గంలో స్లీపర్ రైలు ప్రవేశపెట్టడంపై అంతర్గత ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేశారు. అయితే త్వరలోనే ఈ రైలుకు రైల్వే బోర్డు నుంచి ఆమోదం రావాల్సి ఉంది. రైల్వే బోర్డు ఆమోదించాక ట్రైన్ సర్వీసులు ప్రారంభమవుతాయి. వందే భారత్ స్లీపర్ రైళ్లల్లో అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. విమానం తరహాలో లగ్జరీగా ఉంటుంది. ప్రస్తుతం ఉన్న వందే భారత్ రైళ్లల్లో స్లీపర్ కోచ్‌లు లేవు. దీంతో కేవలం కూర్చొని మాత్రమే ప్రయాణం చేయాల్సి ఉంటుంది. దూర ప్రాంతాలకు వెళ్లేవారు గంటల కొద్ది కూర్చొని వెళ్లాలంటే అసౌకర్యానికి గురవుతున్నారు.

## రెండున్నరేళ్లలోనే ఆంధ్రప్రదేశ్‌కు రూ.19,619 కోట్లు: లోక్‌సభలో కేంద్రం వెల్లడి

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి భారీగా ఆర్థిక చేయూత లభించింది. "రాష్ట్రాలకు మూలధన పెట్టుబడుల కోసం ప్రత్యేక సహాయ పథకం" (ఎస్ఏఎస్‌సీఐ) కింద గత రెండున్నరేళ్ల కాలంలోనే రాష్ట్రానికి రూ.19,619 కోట్లు అందాయని కేంద్ర ప్రభుత్వం మంగళవారం నాడు లోక్‌సభలో ప్రకటించింది. 2020 నుంచి 2024 మధ్య గత వైసీపీ ప్రభుత్వం సాధించిన రూ. 11,386 కోట్లతో పోలిస్తే ఇది అధికమని ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పార్లమెంటులో ఈ వివరాలను అధికారికంగా సమర్పించింది. ఆర్థిక క్రమశిక్షణను పాటించడం, ప్రాజెక్టుల ప్రతిపాదనలను సకాలంలో సిద్ధం చేసి సమర్థవంతంగా అమలు చేయడం వల్లే స్వల్ప కాలంలోనే ఎక్కువ నిధులను సాధించగలిగామని తెలుగుదేశం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది.కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం, 2020-21 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఈ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు మొత్తం రూ. 31,005.47 కోట్లు అందాయి. ఇందులో ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే రూ. 19,619 కోట్లు విడుదలయ్యాయి. 2024-25లో రూ. 7,901.56 కోట్లు, 2025-26లో రూ. 8,289.61 కోట్లు, 2026-27లో ఆగస్టు 1 నాటికి రూ. 3,428.14 కోట్లు మంజూరయ్యాయి. మూలధన వ్యయం కోసం రాష్ట్రాలకు 50 ఏళ్ల కాలపరిమితితో వడ్డీ లేని రుణాలను అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం.గత ప్రభుత్వ హయాంలో 2020-21లో రూ. 688 కోట్లు, 2022-23లో రూ. 6,105 కోట్లు, 2023-24లో రూ. 4,090.81 కోట్లు ఈ పథకం కింద అందాయి.ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనానుభవం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. తద్వారా మరిన్ని పెట్టుబడులను ఆకర్షించి సమ్మిళిత వృద్ధిని సాధిస్తామని ధీమా వ్యక్తం చేసింది.

# కర్నూలులో 29 బైక్‌ల బహిరంగ వేలం

ఓనర్లకు నాలుగో పట్టణ పోలీసుల ఆఖరి అవకాశం!



**కర్నూలు క్రైమ్, ఆగస్టు 04, (సీమ కిరణం న్యూస్ ):** కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకుని గత కొన్ని సంవత్సరాలుగా పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఉంచిన 29 ద్విచక్ర వాహనాలను త్వరలో బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు నాలుగో పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విక్రమసింహ తెలిపారు. ఈ వాహనాలను రవాణా శాఖ అధికారులు పరిశీలించి, వాటి ప్రస్తుత పరిస్థితిని బట్టి వాల్యుయేషన్ సర్టిఫికేట్ జారీ చేసి, స్క్రాప్ వాహనాలుగా విలువ నిర్ధారణ చేశారు. ఈ వాహనాలకు సంబంధించిన అసలు యజమానులు ఎవరైనా ఉంటే, తమ వాహనంపై హక్కును నిరూపించే రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (ఆర్ సి), బీమా పత్రాలు, గుర్తింపు కార్డు మరియు ఇతర సంబంధిత ధ్రువపత్రాలతో వెంటనే కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు సూచించారు. నిర్దేశిత గడువులోగా ఎవరూ యాజమాన్యాన్ని నిరూపించుకోని పక్షంలో, చట్టపరమైన నిబంధనల ప్రకారం పోలీసుల స్వాధీనంలో ఉన్న 29 ద్విచక్ర వాహనాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించే ప్రక్రియ చేపడతామని సీఐ విక్రమసింహ స్పష్టం చేశారు. సంబంధిత వాహన యజమానులు ఆలస్యం చేయకుండా అవసరమైన పత్రాలతో పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి తమ వాహనాలను స్వాధీనం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### వేలానికి సిద్ధంగా ఉన్న 29 ద్విచక్ర వాహనాల వివరాలు

కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో స్వాధీనంలో ఉన్న వాహనాల్లో హీరో హోండా స్ప్లెండర్, సూపర్ స్ప్లెండర్, గ్లామర్, ప్యాషన్ ప్రో, ప్యాషన్ ప్లస్, జడ్డీ, హోండా షైన్, బజాజ్ పల్సర్, ప్లాటినా, డిస్కవర్, బాక్సర్, కాలిబర్, ఒయా స్టార్ సిటీ, సెంట్రా, ఎక్సెల్, టీవీఎస్ హెవీ డ్యూటీ, టీవీఎస్, స్కూటీ పెప్ తదితర మోడళ్లకు చెందిన మొత్తం 29 ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. వీటిని రవాణా శాఖ అధికారులు పరిశీలించి స్క్రాప్ వాహనాలుగా ధ్రువీకరించారు.

### గుర్తింపు కోసం ప్రధాన రిజిస్ట్రేషన్/చాసిస్ నంబర్లు:

AP22 J5882, AP11 S3439, TS33 A4557, AP21 M4498, AP21 AL8498, AP28 AA3332,
AP03 S2324, AP09 AT1766, AP21 J5163, OR04 H0388, AP22 J0298, AP21 P9905,
AP21 BR9880, AP03 AE0418, AP27 H5013, AP03 K8012, AP21 Q9507, AP21 D1265,

అదనంగా కొన్ని వాహనాలకు చాసిస్ నంబర్లు మాత్రమే అందుబాటులో ఉండగా, ఒక వాహనానికి చాసిస్ నంబర్ గుర్తించలేకపోయినట్లు జాబితాలో పేర్కొన్నారు.

# ఉలిందకొండ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్

రోడ్డు ప్రమాదాల నివారణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలి -- ఎస్పీ

సైబర్ మోసాలు, మహిళల భద్రతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచన




**కర్నూలు క్రైమ్/ కల్లూరు, ఆగస్టు 04,(సీమ కిరణం న్యూస్ ):**కర్నూలు జిల్లా ఉలిందకొండ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, కేసు ఫైళ్లు, దర్యాప్తు పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన పెండింగ్ కేసుల స్థితిగతులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తు పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ప్రాపర్టీ కేసులను త్వరితగతిన ఛేదించి, దొంగిలించిన ఆస్తులను బాధితులకు తిరిగి అందించేలా చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించిన ఆయన, డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని చెప్పారు. పోలీసుల విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితుడి సమస్యను సానుభూతితో విని, వారికి త్వరితగతిన పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. అలాగే సైబర్ నేరాలు, మహిళలపై జరిగే నేరాలు, మహిళల రక్షణ చట్టాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, గ్రామాలు, విద్యాసంస్థల్లో ఇందుకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, ఉలిందకొండ ఎస్సై నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలపై తక్షణ స్పందన... అభివృద్ధే లక్ష్యంగా కలెక్టర్ డా. ఏ. సిరి పరిపాలన







క్షేత్రస్థాయిలో పర్యటనలు... ఇంటింటికీ వెళ్లి పింఛన్ల పంపిణీ... ప్రజలకు చేరువైన పరిపాలన

ప్రజా సంక్షేమం, పారదర్శక పాలనతో కర్నూలు జిల్లా ప్రజల ప్రశంసలు

**కర్నూలు ప్రతినిధి, ఆగస్టు 04, (సీమ కిరణం న్యూస్ ):**కర్నూలు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ జిల్లాలో సమర్థవంతమైన పరిపాలన అందిస్తున్నారనే అభిప్రాయం పలువురిలో వ్యక్తమవుతోంది. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను స్వయంగా విని, సంబంధిత శాఖల అధికారులతో తక్షణ చర్యలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేస్తున్నారు. జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో తరచూ పర్యటిస్తూ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనుల పురోగతి, తాగునీరు, పారిశుధ్యం, విద్య, వైద్యం, రెవెన్యూ సేవలపై నేరుగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి, సమస్యలు ఆలస్యం కాకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశిస్తున్నారు. ఇటీవల నగరంలోని పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ డా. ఏ. సిరి, వృద్ధులు మరియు దివ్యాంగ లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పింఛన్లు అందజేయడం విశేషంగా నిలిచింది. లబ్ధిదారులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, సంక్షేమం గురించి ఆరా తీస్తూ, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత, అధికారుల్లో జవాబుదారీతనం, ప్రజలకు వేగవంతమైన సేవలందింపుపై ప్రత్యేక దృష్టిసారిస్తూ జిల్లా అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రజలకు చేరువగా ఉండే పరిపాలన, క్షేత్రస్థాయి పర్యటనలు, మానవీయ దృక్పథంతో వ్యవహరించే తీరు జిల్లా ప్రజల ప్రశంసలను అందుకుంటోంది. జిల్లా సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కలెక్టర్ డా. ఏ. సిరి చేపడుతున్న కార్యక్రమాలు ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.











## కేంద్ర ప్రభుత్వం మరో అద్భుత పథకం.. ప్రతీ నెలా అకౌంట్లోకి రూ.5 వేలు.. వీళ్లే అర్హులు..

తక్కువ ప్రీమియతో భవిష్యత్తులో ప్రతీ నెలా పెన్షన్ పొందాలనుకుంటున్నారా.. ప్రతీ నెలా అతి తక్కువ ప్రీమియంతో 60 ఏళ్ల తర్వాత ప్రతీ నెలా రూ.5 వేల వరకు పెన్షన్ పొందవచ్చు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఈ పెన్షన్ నేరుగా మీ అకౌంట్లో జమ అవుతుంది. మీరు మరణిస్తే నామినీకి అందిస్తారు. కేంద్ర ప్రభుత్వం అనేక పొదుపు, పెన్షన్ పథకాలను అమలు చేస్తున్న విషయం తెలిసిందే. వివిధ వర్గాల కోసం వివిధ స్కీమ్స్ అమలు చేస్తోంది. అందులో భాగంగా స్వయం ఉపాధి, అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికుల కోసం అటల్ పింఛన్ యోజన పథకాన్ని ఎప్పటినుంచో అమలు చేస్తోంది. ఈ స్కీమ్‌లో ఇప్పటికే లక్షలాది మంది చేరారు ఈ స్కీమ్‌లో ఎలా చేరాలనేది ఇప్పుడు చూద్దాం.

### అటల్ పింఛన్ యోజన పథకం ఏంటి..?

ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు రిటైర్మెంట్ తర్వాత ప్రభుత్వం నుంచే పెన్షన్ పొందే పథకాలు అమలవుతున్నాయి. అయితే స్వయం ఉపాధి, ఇతర రంగాల్లో పనిచేసేవారికి కూడా పెన్షన్ ప్రయోజనాలు అందించేందుకు కేంద్రం ఈ పథకం తీసుకొచ్చింది. ఈ పథకంలో చేరినవారు 60 ఏళ్లు వచ్చేంతవరకు తక్కువ మొత్తంలో ప్రీమియం చెల్లించాలి. 60 ఏళ్లు దాటాక మీరు ప్రతీ నెలా రూ.5 వేల వరకు పెన్షన్ పొందవచ్చు. ఎంత ప్రీమియం చెల్లించగలరు.

### అర్హతలు ఏంటి..?

భారత పౌరులై అయి ఉండాలి. వయస్సు 18 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండాలి. సమీపంలోని పోస్టాఫీస్ లేదా బ్యాంకుకు వెళ్లి ఇందులో చేరవచ్చు. కామన్ సర్వీసెస్ సెంటర్ల ద్వారా కూడా నమోదు కావొచ్చు. గత ఆర్థిక సంవత్సరం 2025-26లో 1.35 కోట్ల మంది ఈ స్కీమ్‌లో చేరగా.. 2026 మే నాటికి ఏకంగా 9.10 కోట్ల మంది ఇందులో చేరినట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయస్సువారు ఎక్కువమంది ఇందులో చేరారు. గత 10 పదేళ్లల్లో ఈ వయస్సువారే ఎక్కువమంది ఈ పథకంలో చేరుతున్నారు. 2015-16లో ఈ పథకం ప్రారంభమవ్వగా.. తొలి ఏడాదిలో 7.23 లక్షల మంది చేరారు. ఆ తర్వాత 2024-25లో 54.47 లక్షల మందికి చేరింది.

# పీఎఫ్ ఖాతాదారులకు గుడ్ న్యూస్
# ఇకపై 3 నుంచి 4 రోజుల్లో క్లయిమ్ సెటిల్‌మెంట్..

పీఎఫ్ అనేది ప్రతి ఉద్యోగికి ఆర్థిక భరోసా కల్పిస్తుంది. ఉద్యోగం చేసే సమయంలో నెలవారీ కొంత మొత్తాన్ని దీనిలో జమచేస్తారు. ఉద్యోగ విరమణ అనంతరం పెద్ద మొత్తంలో ఆ ఉద్యోగికి అందజేస్తారు.మరి ఆ ఉద్యోగి కి రిటైర్మెంట్ కు ముందు అనుకోని ఖర్చులు వస్తే పరిస్థితి ఏమిటి, అతడి అవసరం ఎలా తీరుతుంది. దీని కోసమే అత్యవసర సమయంలో పీఎఫ్ నుంచి డబ్బులను విత్ డ్రా చేసుకునే వీలుంది. దాని ప్రకారం ఉద్యోగి తన డబ్బులను విత్ డ్రా చేసుకుని, అత్యవసర ఖర్చులకు వాడుకోవచ్చు.త్వరగా సెటిల్ మెంట్..ఉద్యోగి తన అవసరాలకు అనుగుణంగా పీఎఫ్ ఖాతా నుంచి డబ్బులు తీసుకోవచ్చు. దీనికి కొన్ని నిబంధనలు ఉంటాయి.ముందుగా కారణాన్ని వివరిస్తూ దరఖాస్తు చేసుకోవాలి. దీనినే క్లయిమ్ చేయడం అంటారు. ఆ దరఖాస్తును పరిశీలించి, నిబంధనల మేరకు డబ్బులను అతడి బ్యాంకు ఖాతాలో జమచేస్తారు. ఇదంతా జరగడానికి కొంత సమయం (సుమారు 15 రోజుల నుంచి నెల) పడుతుంది. దానిని ఇప్పుడు వేగవంతం చేసేందుకు ఈపీఎఫ్ ఓ చర్యలు తీసుకుంది. కేవలం మూడు, నాలుగు రోజుల్లోనే సెటిల్ చేయనుంది. దీనిలో భాగంగా ఆటో సెటిల్ మెంట్ అనే విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది.మార్పులు ఇవే..వైద్యం ఖర్చుల కోసం చేసుకున్న క్లయిమ్ (రూల్ 68జే) లపై ఈపీఎఫ్ ఓ కొన్ని మార్పులు చేసింది. ఆ పరిమితిని రూ.50 వేల నుంచి రూ.లక్షకు పెంచింది. విద్య, వివాహం (రూల్ 68కే), ఇళ్ల నిర్మాణానికి (రూల్ 68బి) సంబంధించి కూడా రూ.లక్ష పొందే అవకాశం కల్పించింది. ఆటో సెటిల్ మెంట్




విధానంలో వీటిని వేగంగా పొందే అవకాశం ఉంది.ఆటో సెటిల్ మెంట్..ఖాతాల క్లయిమ్ సెటిల్ మెంట్ లను వేగవంతంగా చేసి, వారి అవసరానికి ఉపయోగపడేలా వేగవంతంగా డబ్బులు ఇవ్వడానికి ఈపీఎఫ్ వో తీసుకువచ్చిన విధానమే ఆటో సెటిల్ మెంట్. మనిషి ప్రమేయం లేకుండా ఆటోమేటిక్ గా క్లయిమ్ పరిష్కారమవుతుంది. వైద్యం, ఉన్నత విద్య, విహహం, ఇల్లు కొనుగోలు కోసం ఉపయోగించుకోవచ్చు.పీఎఫ్ నుంచి డబ్బులు విత్ డ్రా చేసుకోవడానికి కొన్ని నిబంధనలు ఉన్నాయి. చందాదారుడు వ్యక్తిగతంగా లేదా కుటుంబ సభ్యుల వైద్యం కోసం నగదును ఉపసంహరించుకోవచ్చు. నెల, అంతకంటే ఎక్కువ రోజులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నా, శస్త్రచికిత్సలు చేయించుకుంటున్నా విత్ డ్రా చేసుకోవచ్చు. టీబీ, పక్షవాతం, కాన్సర్, గుండె సంబంధిత చికిత్స కోసం ఉపయోగించుకునే అవకాశం ఉంది. అన్ని పత్రాలు అప్ లోడ్ చేసి ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలి. ఆ ఉద్యోగి ఆరు నెలల బేసిక్ ప్లస్ డీఏ లేదా జమ చేసిన సొమ్ములో ఉద్యోగి వాటా (వడ్డీతో సహా).. రెండింటిలో ఏది తక్కువైతే అంత వరకూ డబ్బులు అందజేస్తారు. దీని కోసం డాక్టర్ సంతకం చేసిన సర్టిపికెట్ తప్పనిసరిగా సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.ఉద్యోగి తన, లేదా కుటుంబ సభ్యుల పెళ్లి, పిల్లల చదువు తదితర అవసరాల కోసం పీఎఫ్ ఖాతాను సొమ్మును తీసుకునే వీలుంది. చందదారుడిగా చేరి ఏడేళ్ల పూర్తయిన వారికి మాత్రమే ఈ అవకాశం ఉంటుంది. అది క్సూడా మూడు సార్లు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. బ్యాలెన్స్ లో కనీసం 50 శాతం తీసుకోవచ్చు. వివాహం కోసం అయితే డిక్లరేషన్ అందజేయాలి. చదువు కోసం అయితే సంబంధిత సర్టిఫికెట్ ఇవ్వాలి.ఇల్లు లేదా స్థలం కొనుగోలు, ఇంటి నిర్మాణం, మరమ్మతుల కోసం క్సూడా డబ్బులను విత్ డ్రా చేసుకోవచ్చు. చందదారులు చేరి ఐదేళ్లు పూర్తయిన వారికి కేవలం రెండు స్తార్ల మాత్రమే ఈ విధానంలో అవకాశం ఉంటుంది.వేగంగా సెటిల్ మెంట్..ఇలాంటి క్లయిమ్ ల సెటిల్ మెంట్ అత్యంగా వేగంగా జరగనుంది. ఆటో సెటిల్ మెంట్ విధానంలో చాలా సులభంగా ఈ ప్రక్రియ పూర్తవుతుంది. ఈ విధానంలో మానవ ప్రమేయం ఉండదు. కేవైసీ, బ్యాంక్ లింక్ అన్ని సక్రమంగా ఉంటే కేవలం 3 నుంచి 4 రోజుల్లో డబ్బులు అందుతాయి.

# వణికిస్తున్న బ్లడ్ స్కాండల్ రిపోర్ట్! 30 వేల మందికి ఎయిడ్స్! పూర్తి వివరాలివే!



రక్తం మనిషికి ప్రాణదానం చేస్తుంది. అందుకే సెలబ్రిటీలు మొదలు.. సామాజిక, సేవా, స్వచ్ఛంద సంస్థలు రక్తదాన ప్రాముఖ్యతను వివరిస్తుంటాయి. అయితే రక్తదానం మనిషికి ప్రాణాలు పోయడం ఎంత నిజమో..ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా.. నిండు ప్రాణాలు బలి తీసుకుంటుంది అన్నది కూడా అంతే వాస్తవం. ప్రతి ఏటా కలుషిత రక్తం వల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు, మరణాలు సంభవిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ప్రపంచ చరిత్రలోనే అత్యధిక మందిని బలితీసుకున్న బ్లడ్ స్కాండల్.. రక్త కుంభకోణం 40 ఏళ్ల క్రితం యూకేలో వెలుగు చూసింది.తాజాగా బ్రిటన్ ప్రధాన మంత్రి రిషి సునాక్.. ఈ దారుణానికి సంబంధించిన పూర్తి నివేదికను వెల్లడించడమే కాక.. బాధితుల కుటుంబాలకు క్షమాపణలు తెలియజేశారు దాంతో మరోసారి ప్రపంచవ్యాప్తంగా ఈ ఉదంతం చర్చనీయాంశం అవుతోంది. అసలేంటి బ్లడ్ స్కాండల్.. ఇది ఎలా జరిగింది.. ఎందరు చనిపోయారు.. ఈ దారుణంలో బాధితులెందరూ వంటి పూర్తి వివరాలు మీకోసం..30 వేల మందికి ఎయిడ్స్.. 3 వేల మరణాలు..సుమారు 40 ఏళ్ల క్రితం లండన్‌లో ఈ రక్త కుంభకోణం వెలుగు చూసింది. ఈ కలుషిత రక్తం కారణంగా వేల మంది హెచ్ఐవీ, హెపటైటిస్ బాధితులుగా మారారు. ఇన్నాళ్ల తర్వాత ఈ ఘటనకు సంబంధించిన తుది నివేదక వచ్చింది. యూకే చరిత్రలోనే అత్యంత దారుణమైన ఘటనగా చరిత్రలో నిలిచిన ఈ ఉదంతంపై రిషి సునాక్ ప్రభుత్వం సోమవారం పూర్తి వివరాలు బయటపెట్టింది. నివేదికలో తెలిపిన దాని ప్రకారం.. ఈ కలుషిత రక్తం కారణంగా 30 వేల మంది హెచ్ఐవీ, హెపటైటస్ బారిన పడగా.. సుమారు 3 వేల మంది వరకు మృత్యువాత పడ్డారు.చికిత్స కోసం కలుషిత రక్తం..1970 దశకంలో బ్రిటన్ ప్రభుత్వం.. హీమోఫిలియా వ్యాధిగ్రస్తులు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రుల కోసం ప్లాస్మా చికిత్సను అందుబాటులోకి తెచ్చింది. ఈ క్రమంలో ఫ్యాక్టర్ %ఎ×××% పేరుతో ల్యాబ్‌లో తయారైన కృత్రిమ రక్తాన్ని వినియోగించారు. దీన్ని బ్రిటన్ నేషనల్ హెల్త్ సర్వీస్.. అమెరికా నుంచి దిగుమతి చేసుకుంది. చికిత్సలో భాగంగా వేలాది మంది బాధితులకు ఈ రక్తాన్ని వినియోగించారు. అయితే 1970-90ల మధ్య ప్లాస్మా చికిత్స తీసుకున్న చాలా మందిలో.. సైడ్ ఎఫెక్ట్స్ కనిపించడం మొదలైంది. ముందుగా లివర్ ఇనఫెక్షన్‌కు గురై.. అది కాస్త క్రమంగా హెచ్ఐవీ, హెపటైటిస్-సీ వంటి ప్రాణాంత వ్యాధులకు దారి తీసినట్టు నిర్ధారించారు.ఈ బాధితుల సంఖ్య 30 వేలకు పైగా ఉండగా.. వీరిలో చిన్నారులు కూడా ఉన్నారు. ఇక ఇలా ఇన్‌ఫెక్షన్‌కు గురైన వారిలో సుమారు 3 వేల మంది చనిపోయినట్లు.. నివేదికల్లో వెల్లడయ్యింది. ఇక కొన్ని సందర్భాల్లో హీమోఫీలియాతో బాధపడుతున్న పిల్లలను పరిశోధన వస్తువులుగా భావించారని.. తర్వాత కాలంలో వీరిలో చాలా మందికి హెచ్ఐవీ, హెపటైటిస్ సోకి చనిపోయారని నివేదిక స్పష్టం చేసింది. ఇక ఈ చికిత్స కోసం.. ఖైదీలు, డ్రగ్స్ బానిసల వంటి ప్రమాదకర దాతల నుంచి స్వీకరించిన రక్తం నుంచి సేకరించిన ప్లాస్మాను వినియోగించినట్లు తెలిసింది.ఎంత నష్టపరిహారం అయినా చెల్లిస్తాం: రిషి సునాక్ఇలా స్వీకరించిన కలుషిత రక్తాన్ని.. ప్రసవం, సర్జరీలు, ప్రమాదాల బారినపడిన రోగుల చికిత్సలో వినియోగించారని.. ఫలితంగా వేల మంది ఎయిడ్స్, హెపటైటిస్ బారిన పడినట్లు తేలింది. ఆ తర్వాత కాలంలో ఈ దారుణం వెలుగు చూడటంతో.. యూకే ప్రభుత్వం దీనిపై పూర్తి స్థాయిలో విచారించేందుకు ఓ కమిటీని నియమించింది. ఇక తాజాగా న్యాయమూర్తి బ్రియాన్ లాంగ్‌స్టాఫ్ నేతృత్వంలోని కమిటీ.. 2500 పేజీల నివేదికను సమర్పించింది. అయితే ఇది పూర్తి స్థాయి నివేదిక కాదని.. లాంగ్‌స్టాఫ్ తెలిపారు. ఇక 1980 ప్రాంతంలో రక్తం ద్వారా ఎయిడ్స్ సంక్రమించవచ్చని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. అయినా సరే.. ప్రభుత్వాలు, ఆరోగ్య నిపుణులు ఈ కలుషిత రక్తం కుంభకోణాన్ని పెద్దగా పట్టించుకోలేదు. ఎయిడ్స్ వ్యాప్తి ప్రమాదాలను నివారించడంలో వారు విఫలం అయ్యారు.ఇక తాజాగా అందిన నివేదికపై రిషి సునాక్ మాట్లాడుతూ.. "బ్లడ్ స్కాండల్‌లో వేలాది మంది బాధితులుగా మారిన దశాబ్దాల నాటి ఈ ఘటనను ఇన్నాళ్లు దాచి పెట్టినందుకు క్షమాపణలు కోరుతున్నాను. ఈ భయంకరమైన అన్యాయానికి నేను మనస్ఫూర్తిగా, నిర్ద్వంద్వంగా క్షమాపణలు చెప్పాలనుకుంటున్నాను. బాధిత కుటుంబాలకు ఎంత నష్టపరిహారం అయిన చెల్లించేందుకు మేం సిద్ధం" అన్నారు.

# చైనా ఆక్రమిస్తే.. కిల్ స్విచ్ ఆన్
# అవుతుంది సెమీకండెక్టర్ తయారీ సంస్థల ప్లాన్..!

ఇంటర్నెట్‌డెస్క్: తైవాన్‌ను బలప్రయోగం ద్వారా దక్కించుకొని.. చిప్ పరిశ్రమను ఏలాలన్న చైనా (%జష్ట్రఱఅఋ%) కలను భగ్నం చేసేందుకు టెక్ కంపెనీలు ప్లాన్ చేశాయి.ఒకవేళ బీజింగ్ తన సైనిక బలంతో దురాక్రమణ చేస్తే.. ప్రపంచంలోనే అత్యాధునిక చిప్ తయారీ యంత్రాలు డిజేబులైపోయేలా ఏర్పాట్లు చేశారు. ఈ విషయాన్ని అమెరికా ప్రభుత్వంలోని ఇద్దరు అధికారులు చెప్పినట్లు బ్లూమ్‌బెర్గ్ పత్రిక కథనంలో పేర్కొంది.కొన్నాళ్ల క్రితం అమెరికా ప్రభుత్వం డచ్, తైవాన్ టెక్ సంస్థలతో సమావేశమైంది. ఒకవేళ తైవాన్‌పై చైనా ఆక్రమణ చేపడితే పరిస్థితి ఏమిటని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. దీనికి డచ్‌కు చెందిన ఏఎస్ఎంఎల్ అధికారులు సమాధానమిస్తూ.. మా ప్రభుత్వం ఎప్పుడైతే ఈ ముప్పుపై మమ్మల్ని సంప్రదిస్తుందో.. తక్షణమే ఆ యంత్రాలను రిమోట్ విధానంలో డిజేబుల్ చేసేస్తామని హామీ ఇచ్చింది. ఇప్పటికే నెదర్లాండ్స్ ప్రభుత్వం ఈ దిశగా కొంత కసరత్తు కూడా చేసినట్లు వెల్లడించారు. మరోవైపు ఈ అంశంపై బహిరంగంగా మాట్లాడేందుకు ఏఎస్ఎంఎల్, టీఎస్ఎంసీ, డచ్ వాణిజ్య మంత్రిత్వశాఖ, శ్వేతసౌధం ప్రతినిధి ఇష్టపడలేదు.ప్రపంచంలో చిప్‌ల తయారీకి వాడే ఏఎస్ఎంఎల్‌కు చెందిన ఎక్స్‌ట్రీమ్ అల్ట్రావైలెట్ మిషిన్లను ఈయూవీలుగా పేర్కొంటారు. దాదాపు 200 మిలియన్ డాలర్ల ఖరీదుతో.. ఒక బస్సు సైజులో ఉండే ఈ యంత్రాలకు తరచూ సర్వీసింగ్‌లు, అప్‌డేట్లు తయారీ కంపెనీ నుంచి వెళుతుండాలి. ఇలాంటి సందర్భాల్లో కంపెనీ దానిని రిమోట్ స్విచ్ సాయంతో నిలిపివేసే అవకాశం ఉంది.ఇప్పటికే అమెరికా కోరిక మేరకు చైనాకు అత్యాధునిక చిప్ తయారీ యంత్రాలు ఇవ్వకూడదని ఏఎస్ఎంఎల్ నిర్ణయించింది. వాషింగ్టన్ ఒత్తిడి మేరకు డచ్ ప్రభుత్వం ఈ ఏడాదే నిర్ణయం తీసుకొంది. దీంతోపాటు ఇప్పటికే స్వీకరించిన ఆర్డర్లలో కూడా కోత విధించింది. ఈ నిర్ణయంతో దాదాపు 15 శాతం విక్రయాలు తగ్గే అవకాశం ఉందని ఆ కంపెనీ అంచనా వేసుకొంది.ఏఎస్ఎంఎల్ యంత్రాలకు తరచూ స్పేర్‌పార్టులు మారుస్తూ, మెయింటెనెన్స్ చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రత్యేకంగా తయారుచేసిన దుస్తులు, పరికరాలు వినియోగించాలి. ఇవి కూడా హాలెండ్ నుంచే రావాల్సి ఉంటుంది. చైనా ఆక్రమణ వేళ ఇటువంటి సేవలు కూడా నిలిచిపోయే అవకాశం ఉంది.మరోవైపు చైనా గతేడాది అమెరికాకు భారీగానే షాకిచ్చింది. యాపిల్ ఫోన్లలో వినియోగించే అత్యాధునిక చిప్స్‌ను పాత మోడల్ ఏఎస్ఎంఎల్ యంత్రాలు, అమెరికా నుంచి దిగుమతి చేసుకొన్న కొన్ని టూల్స్ వాడి తయారుచేసింది. ఇక హువావే నేతృత్వంలో ఆ దేశం చిప్స్ తయారీలో స్వయంసమృద్ధి సాధించడంపై దృష్టిపెట్టింది. ఈ దిశగా



ముందడుగు కూడా వేసింది.గతేడాది సెప్టెంబర్‌లో టీఎస్ఎంసీ అధిపతి మార్క్ ల్యూ మాట్లాడుతూ కంపెనీ చిప్ మేకింగ్ యంత్రాలు పనిచేయకుండా చేసేందుకు ఒక మార్గాన్ని సిద్ధం చేశామన్నారు. టీఎస్ఎంసీని ఎవరూ బలవంతంగా నియంత్రించలేరని వ్యాఖ్యానించడం అమెరికా ప్లాన్‌కు అద్దం పడుతోంది.గతేడాది చైనాకు చిప్ తయారీ యంత్రాల ఎగుమతి ఆపేస్తున్నట్లు డచ్ ప్రకటించింది. జాతీయ భద్రతను దృష్టిలోపెట్టుకొని ఈ నిర్ణయం తీసుకొన్నట్లు ఆ ప్రభుత్వం వెల్లడించింది. వీటిల్లో అత్యంత కీలకమైన ఏఎస్ఎంఎల్ సంస్థ అభివృద్ధి చేసిన చిప్ టెక్నాలజీ కూడా ఉంది. ప్రపంచ చిప్స్ తయారీ విభాగంలో ఏఎస్ఎంఎల్ ముఖ్యమైన సంస్థ. దీంతో ఫోన్ల నుంచి ఆయుధాల వరకు ఉపయోగించే సెమీకండక్టర్ల తయారీలో ముఖ్యమైన దశలపై దీని ప్రభావం తీవ్రంగాఉంది.

# అసలు రేవ్ పార్టీ అంటే ఏంటి.. రేవ్ పార్టీలో ఏం చేస్తారు..




గత రెండు రోజులుగా రేవ్ పార్టీ(గురించి అటు మెయిన్ మీడియా, ఇటు సోషల్ మీడియాలో వార్తల గలగలలు వినిపిస్తూనే ఉన్నాయి. ఒక్క నగరాలే అని కాదు పట్టణాల్లో కూడా ఈ కల్చర్ విస్తరించింది.అసలు ఈ రేవ్ పార్టీ అంటే ఏంటి? రేవ్‌పార్టీలో ఏమేమి ఉంటాయి.. ఇందులో ఏం చేస్తారు? ఎందుకు పోలీసులు పట్టుకుంటారు? ఇలాంటి విషయాలపై నెటిజన్లకు ఆసక్తి నెలకొంది. అయితే రేవ్ పార్టీ కల్చర్ 1950ల్లో ఇంగ్లండ్‌లోప్రారంభమైంది. ఆ తర్వాత నెమ్మది నెమ్మదిగా ప్రపంచ వ్యాప్తంగా విస్తరించింది. అయితే మొదట్లో ఈ పార్టీల్లో మ్యూజిక్, డ్యాన్స్, మద్యం తాగుతూ ఎంజాయ్ చేసేవారు. లండన్‌లో ఇటువంటి ఉద్వేగభరితమైన పార్టీలను 'రేవ్ పార్టీలు' అని పిలుస్తారు. ఆ తర్వాత ఈ పార్టీ కల్చర్ ఖండాంతరాలు విస్తరిస్తూ రూపాంతరం చెందింది. ఏదైనా క్లోజుడ్ ప్రదేశంలో, పెద్ద హాల్‌లో చెవులు పగిలిపోయే మ్యాజిక్ పెట్టుకుని మంద్యం సేవిస్తూ పార్టీ చేసుకునే వారు. డ్యాన్స్ పార్టీ(%ఋఅఎవ%) కాస్తా రేవ్ పార్టీగా మారి పోయింది. మన దేశంలో మాదక ద్రవ్యాల నిరోధక(ఎన్‌డీపీఎస్) చట్టం ప్రకారం గంజాయికి కొకైన్ ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ మొదలైన మత్తుపదార్థాలు , మాదకద్రవ్యాల వాడకం నిషేధం.మన దేశంలో గోవా నుంచి ప్రారంభమైంది. ముంబై, పుణె, బెంగళూరు, కోల్‌కతా, ఢిల్లీ-ఎన్‌సిఆర్ నగరాల్లో ఈ పార్టీ కల్చర్ వచ్చింది. ఈ సంస్కృతి హైదరాబాద్ నగరంలో కూడా విస్తరించింది. గత కొన్ని సంవత్సరాలుగా హిమాచల్ లోని కులు లోయ, బెంగుళూరు, పూణే, ముంబై వంటి అనేక నగరాలు వీటికి హాట్‌స్పాట్‌లుగా నిలిచాయి. ఎలక్ట్రానిక్ డ్యాన్స్ మ్యూజిక్ ఈవెంట్స్ అని కూడా పిలిచే రేవ్ పార్టీలు పలు రకాలుగా ఉంటాయి. సాధారణంగా రేవ్ పార్టీలు చాలా ఖరీదుతో కూడుకున్నవి. ఈ పార్టీల్లో గోప్యత కూడా ముఖ్యమైనదిగా భావిస్తారు. అందుకే పెద్ద తలకాయలు, సెలబ్రిటీలు, సినీతారలు ఎంజాయ్‌మెంట్ కోసం ఇక్కడికి వస్తుంటారు. డ్యాన్స్, ఫన్, ఫుడ్, మద్యంతోపాటు, డ్రగ్స్‌కూడా లభ్యమవుతాయి. ఫుడ్, ఆల్కహాల్, సిగరెట్లు కాకుండా, కొకైన్, హషిష్, చరాస్, ఎల్ఎస్‌డి, మెఫెడ్రోన్ తదితర డ్రగ్స్ కూడా దొరుకుతాయని చెప్తారు. కొన్ని రేవ్ పార్టీలలో లైంగిక కార్యకలాపాల కోసం ప్రత్యేక గదులు కూడా ఉంటాయట అందుకే సెక్యూరిటీ పరంగా చాలా జాగ్రత్తలు తీసుకుంటారని చెప్తారు.క్రమక్రమంగా ఈ రేవ్ పార్టీ కల్చర్ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు వేదికైంది. మద్యంతో పాటు అమ్మాయిల న్యూడ్ డ్యాన్స్ చేయించడం, యాంఫేటమిన్, ఎల్ఎస్‌డీ, కెటామైన్, మెథాంఫేటమిన్ , కొకైన్ , గంజాయి లాంటి మాదకద్రవ్యాల వాడకం స్టార్ట్ చేశారు. ఇలాంటి చట్టవ్యతిరేక రేవ్ పార్టీలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఆ పార్టీలో పాల్గొన్న వారిని అదుపులోకి తీసుకుని, నిర్వహకులను అరెస్ట్ చేస్తారు. ఇవి చట్టవ్యతిరేక పార్టీలు అని తెలిసినా ఈ పార్టీలో సెలెబ్రిటీలు పాల్గొనడం గమనార్హం

# రోజంతా ఒడిదుడుకుల్లోనే.. స్వల్ప నష్టాలతో ముగిసిన సెన్సెక్స్!





అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలు, ఎన్నికల నేపథ్యంలో దేశీయ సూచీలు రోజంతా ఒడిదుడుకుల్లోనే కదలాడాయి. లాభనష్టాలు దోబూచులాడాయి. ఈ వారంలో ట్రేడింగ్‌కు తొలి రోజు అయిన ఈ రోజు (మంగళవారం) సెన్సెక్స్ స్వల్పంగా నష్టపోయింది.అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలు, ఎన్నికల నేపథ్యంలో దేశీయ సూచీలు రోజంతా ఒడిదుడుకుల్లోనే కదలాడాయి. లాభనష్టాలు దోబూచులాడాయి. ఈ వారంలో ట్రేడింగ్‌కు తొలి రోజు అయిన ఈ రోజు (మంగళవారం) సెన్సెక్స్ స్వల్పంగా నష్టపోయింది.

# మేడిగడ్డపై కేసీఆర్ మాటే నిజం..
# అన్నదాతల ఆగ్రహంతో దిగొచ్చిన ప్రభుత్వం



బరాజ్ కుంగుబాటుపై ఇన్నాళ్లూ రాద్ధాంతంరిపేర్లు, ఎత్తిపోతలు వదిలి రాజకీయంఎన్నికల్లో లబ్ధికోసం కేసీఆర్‌పై బద్నాంతీరా నీళ్లందక లక్షలాది ఎకరాల్లో పంటనష్టంరైతుల కోపాగ్నికి జడిసి మరమ్మతులకు నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ సర్కార్ 'అనుభవమైతేగాని ఏదీ తెలిసి రాదు'. ఇలానే ఇప్పుడు రైతుల కోపాగ్ని తాకితేగాని కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ సర్కారుకు తత్వం బోధపడలేదు. నిన్నటిదాకా ప్రాజెక్టే నిరర్ధకం, నిష్ప్రయోజనమని మాట్లాడిన నోటితోనే ఇప్పుడు మరమ్మతులు చేసి నీటిని ఎత్తిపోస్తామని సోమవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ప్రకటించింది. ప్రాజెక్టును బందు పెట్టడం వల్ల జరిగిన నష్టమేమిటో బోధపడడంతో దిద్దుబాటుచర్యలు చేపట్టింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెప్పినా పెడచెవిన పెట్టి, పిల్లర్ల కుంగుబాటుపై రాద్ధాంతం చేసి.. లక్షలాది ఎకరాలను ఎండబెట్టి చివరికి రైతుల ఆగ్రహాన్ని చవిచూశాక ఇప్పుడు తప్పు తెలుసుకున్నది. ఎన్డీఎస్ఏ నివేదిక ఆధారంగా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన బరాజ్‌ల మరమ్మతులకు సంసిద్ధత తెలిపింది.ఇన్నాళ్లూ తప్పుడు ప్రచారంకాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్ 7వ బ్లాక్‌లోని 20పిల్లర్ కుంగుబాటునకు గురైన విషయం తెలిసిందే. ఆ ఒక్క సాంకేతిక లోపాన్ని సాకుగా చూపి మొత్తం ప్రాజెక్టే నిష్ప్రయోజనమనే తప్పుడు ప్రచారానికి కాంగ్రెస్ పూనుకున్నది. ఇదే ఎన్నికల ప్రచార అస్త్రంగా చేసుకొని రాజకీయ లబ్ధికోసం అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు కూడా కూలిపోతాయంటూ విషం చిమ్మింది. అధికారంలోకి వచ్చాక బరాజ్‌ల మరమ్మతులు మాని, రైతుల సంక్షేమాన్ని గాలికి వదిలి, కేవలం రాజకీయ ప్రయోజనాలకే పెద్దపీట వేసుకున్నది. ప్రాజెక్టు పేరిట కేసీఆర్‌ను బద్నాం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నది. మంత్రులు, ముఖ్యమంత్రి స్వయంగా బరాజ్‌లను సందర్శించి మరీ అవి నిష్ప్రయోజనం, నిరర్ధకం, వృథా అంటూ కొండెక్కి కూశారు. అసెంబ్లీ వేదికగా అబద్ధపు ప్రచారం చేశారు. నీటి ఎత్తిపోతలు ఆపేసి, అప్పటికే బరాజ్‌లలో నిల్వ ఉన్న నీటిని సైతం దిగువకు వృథాగా వదిలేశారు. దీంతో యాసంగిలో ప్రాజెక్టు పరిధిలోని లక్షలాది ఎకరాలు సాగునీరందక ఎండిపోయాయి. పదేళ్లలో ఎన్నడూ లేనంతగా భూగర్భజలాలు పడిపోయాయి. ఫలితంగా రైతుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వచ్చింది.కేసీఆర్ చెప్పినా పెడచెవిన..మేడిగడ్డ బరాజ్‌ను పునరుద్ధరించవచ్చని, అది పెద్ద సమస్య కాదని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, రాష్ట్ర ఇంజినీరింగ్ నిపుణులు సైతం మొదటినుంచీ కాంగ్రెస్ ప్రభుత్వానికి చెబుతూ వస్తున్నారు. మేడిగడ్డ బరాజ్ ఎగువన చిన్నపాటి అడ్డుకట్ట వేస్తే నీటిని లిఫ్ట్ చేసుకునే వెసులుబాటు ఉంటుందని నొక్కి చెప్పారు. అయి నా కాంగ్రెస్ ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. రైతుల్లో అసహనం, ఆగ్రహం పెరిగాక ఇప్పు డు ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ నివేదికను ముందుపెడుతూ బరాజ్‌లను మరమ్మత్తులు చేయించాలని నిర్ణయించినట్టు వెల్లడించింది. వచ్చే వానకాలంలో నీటిని లిఫ్ట్ చేసే అంశాలపైనా దృష్టి పెట్టినట్టు స్పష్టం చేసింది. ఇదేదో యాసంగిలోనే చేసి ఉంటే లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోకపోయేవని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే యూరప్ మార్కెట్లు కూడా నష్టాలతోనే ఈ రోజును ప్రారంభించాయి.ఛానల్ ఫాలో అవ్వండిగత వారం ముగింపు (74,005)తో పోల్చితే దాదాపు 150 పాయింట్ల నష్టంతో ప్రారంభమైన సెన్సెక్స్ రోజంతా అనిశ్చితిలోనే కదలాడింది. మంగళవారం 73,762-74,189 శ్రేణి మధ్యనే కదలాడింది. చివరకు 52 పాయింట్ల నష్టంతో 73,953 వద్ద రోజును ముగించింది. నిఫ్టీ మాత్రం స్వల్ప లాభంతో ముగిసింది. 27 పాయింట్ల లాభంతో 22,529 వద్ద రోజును ముగించింది. బ్యాంక్ నిఫ్టీ 151 పాయింట్లు నష్టపోయింది. మిడ్ క్యాప్ ఇండెక్స్ 199 పాయింట్లు ఆర్జించింది.బాలకృష్ణ ఇండస్ట్రీస్, వేదాంత, ఆదిత్యా బిర్లా ఫ్యాషన్స్, భారత్ ఎలక్ట్రానిక్స్ తదితర షేర్లు లాభపడ్డాయి. సిటీ యూనియన్ బ్యాంక్, ఆస్ట్రాల్, ఎమ్‌సీఎక్స్ ఇండియా, కమిన్స్ నష్టాలను మూటగట్టుకున్నాయి. డాలరుతో రూపాయి మారకం విలువ ప్రస్తుతం 82.30 వద్ద ట్రేడ్ అవుతోంది.

# బీజేపీకి ఎన్ని లోక్‌సభ సీట్లు వస్తాయంటే పీకే జోస్యం




2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని మరోసారి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం విజయతీరాలకు చేర్చే అవకాశాలున్నాయని ప్రముఖ రాజకీయ వ్యూహకర్త, జన్ సూరజ్ పార్టీ చీఫ్ ప్రశాంత్ కిషోర్ అన్నారు.2019లో బీజేపీ సాధించిన 303 సీట్లకు దగ్గరగా కానీ, దానిని స్వల్పంగా అధిగమించే అవకాశాలు కానీ ఈసారి (2024) ఉన్నాయని ఆయన జోస్యం చెప్పారు."మోదీ సారథ్యంలోని బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తుందని నేను అనుకుంటున్నాను. గత ఎన్నికల్లో సాధించిన సీట్లతో సమానంగా ఈసారి సీట్లు గెలుచుకోవచ్చు. లేదంటే కొద్దిగా సీట్లు పెరగనూ వచ్చు" అని ప్రశాంత్ కిషోర్ అన్నారు. ఐదో దశలో తగ్గిన పోలింగ్ శాతం.. 2019తో పోలిస్తే తగ్గిందా, పెరిగిందా?సహజంగా అధికారంలో ఉన్న ప్రభుత్వం పట్ల కానీ, వారి నేతలపై కానీ కోపం ఉన్నప్పుడు ప్రత్యామ్నాయం ఉందా లేదా అనేది కూడా చూడకుండా ప్రజలు వారిని సాగనంపుతారని, అయితే ఇంతవరకూ మోదీపై విస్తృతమైఆన ప్రజాగ్రహం ఉన్నట్టు వినిపించడం లేదని పీకే చెప్పారు. "ప్రజలు నిరాశచెంది ఉండొచ్చు...తమ కలలు సాకారం కాలేదని అనుకోవచ్చు. కానీ విస్తృత ప్రజాగ్రహం ఉన్నట్టు ఎవరూ చెప్పుకోవడం లేదు" అని ఆయన వివరించారు.బీజేపీ 370 సీట్లు, ఎన్డీయే 400కు పైగా సీట్లు గెలుచుకునే అవకాశాలపై అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ, బీజేపీ 370 సీట్లు ఆశిస్తున్నామని చెబుతున్నా 270 సీట్లు వస్తే ప్రభుత్వం ఏర్పాటు చేయమని ఆ పార్టీ నాయకులు చెప్పలేరని అన్నారు. ఆ ప్రకారం చూసినప్పుడు వారు మెజారిటీకి అవసరమైన 272 సీట్లు సాధిస్తారా లేదా అనేది చూడాల్సి ఉంటుందన్నారు. అయితే ఎలాంటి రిస్క్ ఉండదనే తాను అనుకుంటున్నానని, ఎన్డీయే తిరిగి అధికారంలోకి వచ్చేలాగానే కనిపిస్తోందని అన్నారు.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2O18/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com